# నవవిధ భక్తి మార్గములు

## అమృత కస్తూరి

**<u>సందర్భము:</u>** గురువుల వద్ద విద్యలు నేర్చుకొని వచ్చిన ప్రహ్లాదుని, తన తండ్రి హిరణ్యకశిపుడు ప్రేమతో దగ్గరకు తీసుకుని, దీవించి, తాను చదివిన చదువులలోని సారము ఏమిటి అని అడుగగా, దానికి బదులుగా ప్రహ్లాదుడు శ్రీహరిని ప్రార్థించి, కైవల్యము పొందుటకు నవవిధ భక్తి మార్గాల గురించి చెపుతున్న సందర్భము ఇది.

**<u>పద్యము</u>**

తనుహృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా
ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్ చింతనం
బను నీ తొమ్మిది భక్తిమార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి స
జ్జనుడై యుండుట భద్రమంచు దలతున్ సత్యంబు దైత్యోత్తమా!

**<u>తాత్పర్యము:</u>** త్రికరణ శుద్ధిగా, అంటే మనసులో, మాటలలో, చేతలలో శ్రీమన్నారాయణుడిని అంతటా ఉన్న పరమాత్మ అని నమ్మి, సేవిస్తూ మంచి వ్యక్తిగా జీవించమని చెప్పడమే అన్ని విద్యల సారము. అలా సేవించడానికి తొమ్మిది భక్తి మార్గాలు ఉన్నాయి. అందులో ఏ ఒక్కదాన్నైనా ఎంచుకోవచ్చు. అవి ఏమిటంటే:

**<u>సఖ్యము</u>** — అనగా దేవుడితో స్నేహంగా ఉండడము; **<u>శ్రవణము</u>** — అనగా దేవుడి గురించిన మాటలు, పాటలు, కథలు వినడము,

**<u>దాసత్వము</u>** — అనగా దేవుడిని శరణు వేడుకోవడము, **<u>వందనము</u>** — అనగా దేవుడికి కృతజ్ఞతతో నమస్కరించడము,

**<u>అర్చన</u>** — అనగా దేవుడికి పూజలు చేయడము, **<u>సేవ</u>** — అనగా దేవుడి కార్యక్రమాలలో పనులు చేయడము,

**<u>ఆత్మలోనెరుక</u>** — అనగా మనసులో గట్టి నమ్మకంతో ఉండడము,

**<u>సంకీర్తన</u>** — అనగా దేవుడి నామము, లీలలు గానము చేయడము, **<u>చింతనము</u>** — అనగా దేవుడిని ఎల్లప్పుడూ తలచుకోవడము